నిర్మించారు.. వదిలేశారు

జీవీఎంసీ జోన్–2 పరిధిలో ప్రజా ప్రయోజనార్థం చేపట్టిన పలు నిర్మాణాలను అధికారులు వినియోగంలోకి తీసుకురావడం లేదు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొన్ని నిర్మాణాలు ఏళ్ల తరబడి సాగుతున్నాయి. ఇంకొన్ని ఏళ్ల కిందట పూర్తయినా.. నిరుపయోగంగా వదిలేశారు. నిర్మాణాల పేరిట రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని అధికారులు, ప్రజాప్రతినిధులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతన నిర్మాణాలను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. - ఆరిలోవ

ప్రజా ప్రయోజనార్థం చేపట్టిన పలు నిర్మాణాలకు కలగని మోక్షం

కూటమి ప్రభుత్వంలో ప్రారంభానికి నోచుకోని వైనం

పట్టించుకోని పాలకులు, అధికారులు

వినియోగంలోకి తేవాలని స్థానికుల విజ్ఞప్తి



తోటగరువు హైస్కూల్ వెనుక నిర్మించిన రైతుబజార్

రైతుబజార్ కోసం ఎదురుచూపులు

ఆరిలోవ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల రైతుబజార్ కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకొని సుమారు అరెకరం ప్రభుత్వ స్థలంలో రైతుబజార్ నిర్మించారు. దీని కోసం మార్కెటింగ్ శాఖ రూ.80 లక్షలు మంజూరు చేసింది. రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకుకూరలు విక్రయించడానికి 38 షాపులు, వ్యాపారుల కోసం 5 కిరాణ షాపులు, ఈవో కార్యాలయం, స్టోర్ రూమ్, వాచ్‌మెన్ గది, పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఆర్‌వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఇంతవరకు వినియోగంలోకి తీసుకురాలేదు. రైతుబజార్ ప్రారంభం కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు.

పబ్లిక్‌కు దూరంగా పార్క్

9వ వార్డు జోడుగుళ్లపాలెంలో బీచ్ రోడ్డు పక్కన జీవీఎంసీ గతేడాది పబ్లిక్ పార్క్ నిర్మించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.60 లక్షలతో చేపట్టిన ఈ పార్కు పనులు ఆరు నెలల కిందట పూర్తయ్యాయి. నేటి వరకు దీనిలో పిల్లల కోసం ఆటపరికరాలు, పెద్దలు సేదదీరడానికి షెల్టర్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. ఆరు నెలలుగా ఈ పార్క్‌ను అధికారులు ప్రారంభించకుండా వదిలేశారు. ఇది అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలకు వినోదం కలుగుతుంది.



జోడుగుళ్లపాలెంలో నిర్మించిన పబ్లిక్ పార్క్

సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ సంగతేంటి?

విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో నిర్మించిన సిటీ డయాగ్నస్టిక్ సెంటర్‌ను నేటికీ ప్రారంభించలేదు. 2021లో అరెకరం స్థలంలో రూ.20 కోట్లతో సెంటర్ పనులు అధికారులు ప్రారంభించారు. సుమారు నాలుగేళ్లకు నిర్మాణం పూర్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ సెంటర్‌కు అవసరమైన ల్యాబ్ పరికరాలు, పనిముట్లు, యంత్రాలు కొనుగోలు చేయలేదు. దీంతో ఇది వినియోగంలోకి రాకుండా మిగిలిపోయింది. ఈ సెంటర్ వినియోగంలోకి వస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుంది. నగరంలో ఎక్కడివారైనా రోగులకు ఈ సెంటర్‌లో ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్ చేస్తారు.



విమ్స్ ఆవరణలో డయాగ్నస్టిక్ సెంటర్

నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్



13వ వార్డు ఆరిలోవ కాలనీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఎదురుగా గెడ్డ అంచున జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి సుమారు ఆరేళ్లు గడిచింది. రూ.45 లక్షలతో 42 షాపులు నిర్మించారు. కూరగాయలు, చికెన్, మటన్ షాపులతోపాటు ఫిష్ మార్కెట్‌కు సంబంధించిన వ్యాపారులు కూడా షాపులు నిర్వహించుకోవచ్చని అప్పట్లో జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. ఇంతవరకు వీటిని వ్యాపారులకు కేటాయించలేదు. దీంతో నిరుపయోగంగా మిగిలిన ఈ షాపులను కొందరు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. దీనికి సమీపంలోనే మద్యం దుకాణం ఉండటంతో మందుబాబులు దీన్ని ఓపెన్ బార్‌గా మార్చేశారు. మరికొందరు రాత్రిళ్లు జూదం, అసభ్యకరమైన వ్యవహారాలకు పాల్పడుతున్నారు.

“ పబ్లిక్ పార్క్‌ను ప్రారంభించాలి

జోడుగుళ్లపాలెంలో గత ప్రభుత్వం నిర్మించిన పబ్లిక్ పార్క్‌ను వెంటనే ప్రారంభించాలి. ఈ పార్కును వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేయడంపై అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. బీచ్ రోడ్డును ఆనుకొని ఉన్న ఈ పార్కులో సాయంత్రం వేళ పిల్లలు ఆడుకునేలా, వృద్ధులు సేదతీరేలా ఏర్పాట్లు చేసి వినియోగంలోకి తీసుకురావాలి. - భీమారావు, విశాలాక్షినగర్ ”

“ రైతుబజార్‌ను అందుబాటులోకి తేవాలి

ఆరిలోవ ప్రాంతం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుబజార్ నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి తీసుకురాలేదు. తోటగరువులో హైస్కూల్ వెనుక నిర్మించిన రైతుబజార్‌ను ప్రారంభించకపోవడంతో వేరే ప్రాంతాలకు కూరగాయల కోసం వెళ్లాల్సి వస్తోంది. అధికారులు దీన్ని వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తేవాలి. - ఆర్.శ్రీనివాసరావు, బాలాజీనగర్ ”

క్లుప్తంగా

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 27 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 27 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. ఈ కేంద్రంలో జనరల్ విద్యార్థులు 123 మందికి గాను ఏడుగురు రాకపోవడంతో 116 మంది పరీక్ష రాశారన్నారు. ఒకేషనల్ కోర్సుల పరీక్షలకు 438 మందికి గాను 20 మంది గైర్హాజరు కాగా.. 418 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రానికి 561 మందిని అలాట్ చేశారని, వీరిలో 534 మంది పరీక్ష రాయగా 27 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

త్రీ టౌన్ సీఐగా పైడయ్య



బీచ్‌రోడ్డు: నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సీఐగా పి.పైడయ్యను నియమిస్తూ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సీఐ పి.రమణయ్యను బదిలీ చేయడంతో ఆయన స్థానంలో సీఎస్‌బీలో పనిచేస్తున్న పైడయ్యను నియమించారు.

భారీ వాహనాలకు అడ్డుకట్ట



పందిమెట్ట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఏయూక్యాంపస్: ఇటీవల బీచ్ రోడ్డులో జరిగిన ప్రమాదం నేపథ్యంలో పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు. కొద్ది రోజుల కిందట భారీ ఇసుక లారీ నోవాటెల్ హోటల్ డౌన్‌లో బ్రేక్ ఫెయిల్ అయి నేరుగా ఫుట్‌పాత్ గోడను ఢీకొట్టి పార్క్‌లోకి దూసుకువెళ్లింది. గతంలో కూడా ఇదే ప్రాంతంలో ప్రమాదం జరగడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇటువంటి సంఘటనలు పునరావృతమవుతున్న నేపథ్యంలో పోలీసులు నష్టనివారణ చర్యలకు ఉపక్రమించారు. పందిమెట్ట జంక్షన్ వద్ద రోడ్డుకు ఇరువైపులా భారీ ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు వెళ్లలేని విధంగా వీటిని నిర్మించారు. భారీ వాహనాలకు ప్రవేశం లేదంటూ దీనిపై బోర్డులను సైతం ఏర్పాటు చేశారు.

ఆదమరచి అడుగేస్తే అంతే..!



ఏటీఎంకు వెళ్లే మార్గంలో పలకలు లేని కాలువ

ఏయూక్యాంపస్: ఆదమరచి అడుగేస్తే ప్రమాదాల బారిన పడే అవకాశముంది. చినవాల్తేరు కోటక్ స్కూల్ పక్కనే ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మురుగు కాలువపై పలకలను తొలగించి తిరిగి వేయలేదు. రాత్రి వేళల్లో ఏటీఎంకు వెళ్లేవారు ఆచితూచి అడుగేయాల్సిన ఉంది. ఇక్కడ కాంతి కూడా తక్కువగా ఉంటోంది. రాత్రిళ్లు ఏటీఎంకు వెళ్లేవారు కాలువపై పలకలు లేవనే విషయం గ్రహించకుండా అడుగేస్తే ప్రమాదం కొనితెచ్చుకునే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు వెంటనే కాలువపై పలకలు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొమ్మ కొమ్మకో పూల గుత్తి



గురజాడ కళాక్షేత్రం వద్ద విరబూసిన టబాబియా రోజియా చెట్లు

ఏయూక్యాంపస్: రహదారి పక్కన నీడనివ్వడానికి, అలంకరణ కోసం నాటిన వృక్షాలు ఎంతో కనువిందు చేస్తున్నాయి. గురజాడ కళాక్షేత్రం నుంచి గవర్నర్ బంగ్లాకు వెళ్లే మార్గంలో ఇరువైపులా ఉన్న టబాబియా రోజియా మొక్కలు పింక్ కలర్ పుష్పాలతో మైమరపిస్తున్నాయి. చెట్టుకు ఉన్న ఆకులకంటే అధికంగా గుత్తులుగా పుష్పాలు విరబూస్తూ ఎంతో ఆకర్షిస్తున్నాయి. నేలపై రాలిన పుష్పాలు చూపరులను కన్ను తిప్పుకోనివ్వడం లేదు. ఎంతో అందంగా కనిపిస్తున్న ఈ పుష్పాల సౌందర్యాన్ని చూసి తీరాల్సిందే. నగరంలో మరిన్ని ప్రాంతాల్లో సైతం ఈ చెట్లు ప్రస్తుతం పుష్పాలతో అందంగా కనిపిస్తున్నాయి.

డీఎంహెచ్‌వోతో కేంద్ర బృందం భేటీ

మహారాణిపేట: పలు ఆరోగ్య కార్యక్రమాల నిమిత్తం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావుతో భేటీ అయింది. పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ నుంచి వచ్చిన కేంద్రం బృంద సభ్యుడు డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు ఆధ్వర్యంలో పలువురు సభ్యులు ఈ నెల 14 వరకు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. డీఎంహెచ్‌వోను పలు వివరాలు అడిగారు. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య సంక్షేమ పథకాల వివరాలను ప్రోగ్రాం అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి వచ్చే శనివారం వరకు పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సమీక్షిస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్ర బృంద సభ్యులకు వివరాలు తెలియజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

కొక్కొరొక్కో..



ఇటీవల బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు కోడి మాంసం తినడానికే భయపడుతున్నారు. ఈ సమయంలో దేశీయకోళ్లకు డిమాండ్ పెరుగుతోంది. డైరీ ఫారం కూడలి వద్ద గ్రామాల నుంచి తీసుకొచ్చిన నాటు కోళ్ల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. వీటిని కొనుగోలు చేయడానికి నగరవాసులు సైతం ఆసక్తి చూపడంతో విక్రయాలు ఆశాజనకంగా ఉంటున్నాయి.

ఫొటో: సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రాంగణ ఎంపికలో విద్యార్థినుల ప్రతిభ

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ), శ్రీచైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పలువురు విద్యార్థినులు ప్రతిభ చూపి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల నియామక పత్రాలు అందజేశారు. 13 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్లేడ్‌తో దాడి కేసులో ఎస్‌ఐ తీరుపై విమర్శలు

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెంలో యనమారెడ్డి వేణు అనే వ్యక్తి.. గుడ్ల పైడిరెడ్డి అనే వ్యక్తిపై యాక్సా బ్లేడ్‌తో దాడి చేసిన ఘటనలో ఎస్‌ఐ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నెల 9వ తేదీ ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఈ దాడి ఘటన జరగ్గా.. ఐవోగా వ్యవహరించిన ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాస్ మంగళవారం వరకు బయటకు రాకుండా గోప్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. గాయపడిన వ్యక్తి రెండు రోజుల పాటు చావుబతుకులతో పోరాడినట్లు తెలిసింది. విపరీతంగా రక్తస్రావం కావడంతో అతడికి బ్లేడ్ గాయాలు తగిలిన శరీరంలోని పలు భాగాల్లో వైద్యులు 30 వరకు కుట్లు వేసి సంరక్షించినట్లు సమాచారం. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంరక్షించడంతో ప్రస్తుతం పైడిరెడ్డి మెడికవర్ ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. ఈ ఘటనలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు మంగళవారం నిర్ధారించారు. ఈ కేసు వ్యవహారంలో బాధితుడు తీవ్ర గాయాలతో ఉన్నప్పటికీ ఐవోగా ఉన్న ఎస్‌ఐ శ్రీను కేసు నమోదుతోపాటు మీడియాకు సమాచారం ఇవ్వడంలో గోప్యత పాటించడంపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. నిందితుడిని అదుపులోకి తీసుకోని కోర్టు ముందు హాజరు పరచడంలో ఇంత అలసత్వం జరగడం వెనుక కారణమేంటనే సర్వత్రా చర్చ జరుగుతోంది.

ఏయూలో ఎందుకీ నిర్లక్ష్యం..!

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ వీసీ భవనం ఎదురుగా ప్యూర్ ఫైడ్ వాటర్ ఫిల్టర్లు వృథాగా పడి ఉన్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం వీటిని ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థ వితరణగా వర్సిటీకి అందజేసింది. ఇవి విద్యార్థులకు ఉపయోగపడటం లేదు. పరిశుభ్రమైన తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఇటీవల వీసీ భవనం ముందు ధర్నా చేశారు. రీసెర్చ్ స్కాలర్స్ సైతం హాస్టళ్ల సమస్యలపై నిరసన చేపట్టినా.. వర్సిటీ అధికారుల్లో చీమకుట్టినట్లైనా లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ స్వచ్ఛంద సంస్థ విద్యార్థుల కోసమని ఇచ్చిన వాటర్ ఫిల్టర్లను అమర్చేందుకు అధికారులకు తీరక లేకపోవడం గమనార్హం. లక్షలాది రూపాయలు విలువ చేసే వాటర్ ప్యూర్ ఫైడ్ ఫిల్టర్లును ఆరుబయట ఇలా వృథాగా వదిలేశారేంటి..? అంటూ వాటిని చూసిన వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత వైస్ ఛాన్సలర్ ఇలాంటి వాటిపై దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు. వేసవి దృష్ట్యా యుద్ధప్రాతిపదికన వసతి గృహాల్లో వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందే అవకాశం ఉంటుందని వర్సిటీ శ్రేయస్సు కోరే కొంతమంది ఆచార్యులు అంటున్నారు. ఆ దిశగా నూతన వీసీ చర్యలు చేపడతారో.. లేదో..? వేచి చూడాల్సి ఉంది.



ఏయూ వీసీ భవనం ఎదురుగా వృథాగా వదిలేసిన ప్యూర్‌ఫైడ్ వాటర్ ఫిల్టర్లు

పైడిమాంబ పండగ.. ఊరంతా వేడుక

వైభవంగా ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

ఆరిలోవ: పాత డెయిరీఫారం వద్ద కొలువైన పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా సందడిగా మారింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా డెయిరీఫారం, రవీంద్రనగర్, తోటగరువు ఆరిలోవ, సాగర్‌నగర్, ఎండాడ, మధురవాడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని పురాతనమైన వేపచెట్టుకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు క్యూలైన్లు, తాగునీరు ఏర్పాటు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. డప్పులు, వాయిద్యాల నడుమ రవీంద్రనగర్ బస్‌స్టాప్ వద్ద ప్రారంభించిన సంబరాలు ఎస్.ఐ.జి.నగర్, వివేకానందనగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్‌ల మీదుగా డెయిరీఫారం వద్ద అమ్మవారి గుడి వరకు సాగాయి.

భక్తులకు ప్రసాద వితరణ

అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు రవీంద్రనగర్ నుంచి డెయిరీఫారం వరకు స్థానిక యువత, వివిధ సంఘాల నిర్వాహకులు రోడ్డుకు ఇరుపక్కలా శిబిరాలు ఏర్పాటు చేసి మజ్జిగ, పులిహోర, చక్కెర పొంగలి, బెల్లం నీరు, మంచినీరు పంపిణీ చేశారు.



పైడిమాంబను దర్శించుకుంటున్న భక్తులు



ఆలయ సమీపంలో భక్తులకు ప్రసాదం అందిస్తున్న శ్రీముఖలింగం కళింగ సేవా సంఘం సభ్యులు

ఆలయ సమీపంలో శ్రీ ముఖలింగం సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు సంబాల అప్పారావు, హనుమంతకుమార్, నారాయణరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం

ఇక్కడ ప్రతి ఏడాది మాదిరిగా వేలాది మంది భక్తులు వస్తారని ఊహించిన ఆరిలోవ పోలీసులు గుడి వద్ద బందోబస్తు నిర్వహించారు. వీరిలో కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. గుడి ఆవరణలో ఖాళీగా ఉన్న సమయంలో లోపలికి ఎవ్వరినీ విడిచిపెట్టకుండా ఆంక్షలు విధించారు. గంటలు తరబడి రోడ్డు మీదే నిరీక్షించిన భక్తులు కోపోద్రిక్తులై పోలీసులపై తిరగబడ్డారు. ఆలయ కమిటీ సభ్యులు కొందరు అక్కడికి చేరుకుని భక్తులను వారించాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తుల ఆగ్రహానికి గురైన పోలీసులు నెమ్మదిగా అక్కడి నుంచి పక్కకు జారుకుని గేటు వద్ద బందోబస్తు నిర్వహించకుండా వదిలేశారు. దీంతో ప్రశాంతంగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆలయం వద్ద పోలీసులను నిలదీస్తున్న భక్తులు

కంటి వైద్య పరీక్షలు తప్పనిసరి

మహారాణిపేట: మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులు తరచూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం వివిధ విభాగాల అధికారుల సమక్షంలో గ్లకోమా కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 15 వరకు ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, 40 ఏళ్లు దాటిన అందరూ కంటి వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఇతర శిబిరాల్లో ఉచితంగా నేత్ర పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులు కళ్లద్దాల మార్పు కోసం ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రాంతీయ కంటి ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి ర్మయి, డాక్టర్ మాధవి, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, డాక్టర్ హారిక, ఆర్.బి.ఎస్.కె.అప్పారావు, రవి శంకర్, నాగభూషణం, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

వ్యాధులపై సమగ్ర అవగాహన కల్పించాలి

ఎంవీపీకాలనీ: వ్యాధులు, ఇతర సమస్యలపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించాలని డాక్టర్ వై.రమణ పేర్కొన్నారు. ఆయన నేతృత్వంలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీమ్ మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్–9లో స్థానిక వైద్య సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ పిల్లల్లో సక్రమించే వ్యాధుల గుర్తింపు, వాటిపై అవగాహన, నివారణ వంటి కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో పిల్లలు టీబీ వంటి వ్యాధుల బారిన ఎక్కువగా పడుతున్న నేపథ్యంలో దాని నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం పిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధులు, బరువు తగ్గడం, థైరాయిడ్, ఆటిజం, ఎనీమియా వంటి వ్యాధులపై ఇటీవల కాలంలో స్క్రీనింగ్ చేసిన విధానాన్ని తెలుసుకోవడంతోపాటు డేటా వివరాలను సేకరించారు. కార్యక్రమంలో పీఆర్‌సీ టీమ్ సభ్యుడు డాక్టర్ పడాలు, స్థానిక వైద్యాధికారి డాక్టర్ పద్మ, కార్పొరేటర్ మంగవేణి, స్కూల్ ప్రిన్సిపాల్ పి.సునీల్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న డాక్టర్ రమణ తదితరులు

వేసవి పలకరిస్తోంది..



ఏయూక్యాంపస్: వేసవి కాలం ఆరంభంలోనే తన ప్రభావం చూపిస్తోంది. భానుడి ప్రతాపం ఈ ఏడాది అధికంగానే ఉంటుందనే సందేశాన్ని అందిస్తున్నాడు. ఉదయం 11 గంటల తరువాత రోడ్లపై జన సంచారం అంతంత మాత్రంగానే ఉంటోంది. బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా గొడుగులు వినియోగిస్తున్నారు. ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవడానికి అన్ని మార్గాలను ఉపయోగిస్తున్నారు. బీచ్ రోడ్డులో ఒక కుటుంబం గొడుగులు చేతపట్టుకుని వెళ్తూ కనిపించింది. మరో చోట ఇద్దరు స్నేహితులు సముద్రపు అలల వద్ద కాస్త సేదతీరారు. మరో వైపు నగరంలో కార్యాలయాలు, ఇళ్లలో నీటి క్యాన్‌ల వినియోగం పెరిగింది. నగరంలోని పలు ప్రాంతాల్లో నీరు నిల్వచేసే ట్యాంక్‌లు, మంచి నీటి క్యాన్‌లు తీసుకెళ్తున్న వారు కనిపించారు. వేసవి తాపానికి, నీటి అవసరానికి ఈ చిత్రాలు అద్దం పడుతున్నాయి.





- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం